సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024


బడులకు తాళం..
ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. టీచర్ సమావేశానికి వెళ్తే పాఠశాలకు తాళమే..
8లో▸


సారా స్థావరంపై దాడులు
ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో బెల్లం, పానకం స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.
8లో▸


రైతన్నకు చేరువలో సేవలు
అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. సాగులో ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.
9లో▸

న్యూస్‌రీల్

అడ్మిషన్లు ప్రారంభం

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు, ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం ఉందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రఫియా ఖానమ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 – 25విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరంలో బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తోపాటు 2015 –16 విద్యా సంవత్సరం నుంచి 2023 – 24 విద్యా సంవత్సరం వరకు అడ్మిషన్లు పొంది ఫీజు చెల్లించని వారు ఈ నెల 18వ తేదీలోపు ఫీజు చెల్లించాలని తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు రక్ష

జిల్లా సంక్షేమ అధికారి వెంకటేశ్వరమ్మ


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరమ్మ

అనంతగిరి: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయని జిల్లా సంక్షేమ అధికారి ఏ వెంకటేశ్వరమ్మ తెలిపారు. పట్టణంలోని రాజీవ్ గృహకల్ప కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. బిడ్డ పుట్టిన గంట లోపు ముర్రు పాలు తాగించాలన్నారు. ఇలా చేయడం ద్వారా పిల్లల్లో రోగ నిరోధన శక్తి పెరుగుతుందన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జిల్లాలోని 1,107 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాలిని, అంగన్‌వాడీ టీచర్ మనోరమ, ఏఎన్‌ఎంలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మల్లప్ప(ఫైల్)

దోమ: వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని గుండాల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు చిన్నమల్లి మల్లప్ప(110) గురువారం మృతి చెందారు. ఈయనకు ఐదుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మనవళ్లు, మనవరాళ్లు 12మంది ఉండగా, ముని మనవళ్లు, మనవరాళ్లు 18 మంది ఉన్నారు. ఇన్నాళ్లు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లప్ప భౌతికకాయాన్ని కాంగ్రెస్ నేతలు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్ గ్రామ సమీపంలో వెలసిన రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఆలయ ఈవో శేఖర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చైర్మన్, ఆరు గురు డైరెక్టర్లకు దరఖాస్తు చేసుకుంటే దేవాదాయ కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు.



నైపుణ్యానికి పునాది

బేగరికంచెను ఫ్యూచర్ సిటీగా మారుస్తాం

- న్యూయార్క్‌కు దీటుగా నెట్ జీరో సిటీ రూపుదిద్దుకుంటుంది
- వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, పీహెచ్‌సీ, మోడ్రన్ స్కూల్, కమ్యూనిటీ సెంటర్లకు శంకుస్థాపన


స్కిల్ యూనివర్సిటీ భవన నమూనాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

కందుకూరు: ఇప్పటి వరకు ఓ సాధారణ బేగరికంచె.. ఇకపై ఫ్యూచర్ సిటీగా మారబోతోంది. న్యూయార్క్‌కు దీటుగా రూపుదిద్దుకోబోతుంది. వచ్చే నాలుగేళ్లలో ఈ కుగ్రామం మరో మహానగరంగా ఆవిష్కృతం కాబోతోంది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నెట్ జీరో సిటీ అభివృద్ధిలో భాగంగా మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ, బేగరికంచె జీపీ పరిధిలో ప్రభుత్వం ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సహా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోడ్రన్ స్కూల్, కమ్యూనిటీ సెంటర్లకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా ఈ ప్రాంతంలో నాలుగో నగరం రాబోతోంది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను పలు క్లస్టర్లుగా విభజించి ఫార్మా విలేజ్‌లు దర్శనం ఇవ్వబోతున్నాయి. ఎత్తైన బహుళ అంతస్తుల భవనాలు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, ఉద్యోగుల నివాసాలు, ఆస్పత్రులు, క్రీడా మైదానాలు, హోటళ్లతో ఈ ప్రాంతం అలరించబోతోంది. అందమైన పార్కులు, విశాలమైన రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో రైలు సేవలతో మరో నాలుగేళ్లలో కాలుష్యరహిత నగరం కళ్ల ముందు ఆవిష్కృతం కాబోతోంది.

రోడ్డు విస్తరణ బాధ్యత కేఎల్‌ఆర్‌కు..

నెట్ జీరో సిటీ నుంచి ఓఆర్‌ఆర్ వరకు 200 అడుగుల ఎలివేటెడ్ కారిడార్ రోడ్డుకు భూసేకరణ బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో కేఎల్‌ఆర్ అభిమానులు పెద్ద ఎత్తున జై కేఎల్‌ఆర్, జై కాంగ్రెస్ అని నినదించారు.

రెండున్నర గంటలు ఆలస్యంగా..

స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన ఉండగా, మంత్రి మండలి సమావేశం కారణంగా 6.26 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న అధికారులు, అభిమానులకు నిరీక్షణ తప్పలేదు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, కోదండరెడ్డి, తీగల కృష్ణారెడ్డి, చిన్నారెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మేయర్ పారిజాత, సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎస్. మల్లేష్, కృష్ణనాయక్, ఐఎస్‌బీ ఫౌండర్ శ్రీనిరాజు, గ్రీన్ బిల్డింగ్స్ కౌన్సిల్ శేఖర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కలెక్టర్ శశాంక, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గిన 'విద్యుత్' ఫిర్యాదులు

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఫారూఖీ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. 2023 జనవరి–జూన్ మధ్యకాలంలో 5,83,672 ఫిర్యాదులు రాగా, ఈ ఏడాది ఇదే కాలవ్యవధిలో 3,97,934 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 31.82 శాతం ఫిర్యాదులు తగ్గినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా 2023 జనవరి–జూన్ మధ్యకాలంలో 35,949 ఫిర్యాదు రాగా, ఈ ఏడాది ఇదే కాల వ్యవధిలో 60.96 శాతం తగ్గుదలతో 14,035 ఫిర్యాదులొచ్చాయని అన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, 1912 టోల్ ఫ్రీ నంబర్ కాల్ సెంటర్ పనితీరుపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు గాను 1912 టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. 213 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల కార్యాలయాల సిబ్బంది ఉపయోగించే వాహనాల్లో యాప్ ఆధారిత జీపీఎస్ సాంకేతికను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది సంబంధిత ప్రాంతానికి చేరుకుని సత్వర చర్యలు తీసుకుంటున్నారా? లేదా? అనే అంశంపై సమీక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ ఫిర్యాదులు, బ్రేక్ డౌన్ సమాచారం, ఫీడర్ల సమాచారం, బిల్లింగ్/ కలెక్షన్ సమాచారం వంటి వివరాలతో కూడిన సమీకృత డాష్ బోర్డును అందుబాటులోకి తెచ్చామన్నారు. దీంతో రియల్ టైంలో సమాచారం తెలుసుకునే వీలుంటుందన్నారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో 74 మంది సుశిక్షిత ఆపరేటర్లను అందుబాటులో ఉంచి బలోపేతం చేశామన్నారు. ఏకాలంలో 400 ఫిర్యాదులు స్వీకరించే రీతిలో సామర్థ్యం పెంపొందించామన్నారు. ఫిర్యాదుదారులకు కంప్లైంట్ నంబర్ సైతం ఎస్‌ఎంఎస్ ద్వారా పంపిస్తామని ఆయన వివరించారు.


తాండూరు: ఇందిరాచౌక్ వద్ద మందకృష్ణ మాదిగ, మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

- 30 ఏళ్ల 'దండోరా'కు ఫలితం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని, మూడు దశాబ్దాల కల నెరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ప్రధాని మోదీ చిత్రపటానికి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుపై నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు మాదిగ, డి.కృష్ణ, అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, జిల్లా మాజీ అధ్యక్షుడు ఆశన్న, జిల్లా కన్వీనర్ శివాజీ, కోకన్వీనర్ జానీ, కార్యదర్శి డప్పు మహేందర్, నాయకులు అరవింద్, ఆనంద్‌కుమార్, జుంటిపల్లి వెంకట్, జగదీష్, పరశురామ్, బలరాం, శ్రీకాంత్, విజయ్,నరేష్, ఉమశంకర్, రవికుమార్, నర్సింహులు, యాదగిరి, వెంకటేష్, బుడిగ జంగం నాయకులు పాల్గొన్నారు.

తీర్పును స్వాగతిస్తున్నాం: మాజీ మంత్రి చంద్రశేఖర్



అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటాలు చేశామని, ఆ పోరాటాల ఫలితమే నేడు సుప్రీం కోర్టు తీర్పు అని మాజీ మంత్రి ఏ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. దీనిపై మొదటి నుంచి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నం చివరకు నెరవేరిందన్నారు. మాదిగ ఉప కులాలకు సైతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా మా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

స్వచ్ఛ పచ్చ దనం

కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం

- ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయం
- పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధం, వర్షపు నీటి సంరక్షణపై అవగాహన, వీధి కుక్కల నివారణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: స్వచ్ఛదనం – పచ్చదనం పేరుతో ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రగతి పేరిట 11 రోజుల పాటు ప్రజల వద్దకు వెళ్లింది. కాంగ్రెస్ సర్కారు ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలని తలపెట్టింది. 5 రోజుల్లో ఏయే రోజు ఏయే కార్యక్రమం నిర్వహించాలనే దానిపై ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. గురువారం ఈ విషయమై చీఫ్ సెక్రటరీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోజువారీ కార్యక్రమాలు

5వ తేదీ..

- స్థానిక నాయకులు, యువజన, స్వయం సహాయక సంఘాలు, వార్డు కమిటీలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో వీధి కుక్కల బెడద, తడి పొడి చెత్తను వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ, తోటల పెంపకం, పారిశుద్ధ్యం వంటి వాటిపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నిషేధం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ల, ఇతర ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

6వ తేదీ..

- తాగునీరు, వర్షపు నీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవడం, తాగు నీటి వనరులు శుభ్ర పరచడం, క్లోరినేషన్ చేయడం, నీటిని పరీక్ష చేయటం లాంటివి చేపడతారు. చెరువులు, కుంటలను సందర్శించి మరమ్మతులకు ప్రణాళికలు తయారు చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు.

7వ తేదీ..

- గ్రామాలు, పట్టణాల్లో నీరు నిలిచే ప్రదేశాలు గుర్తించి.. వాటిని పూడ్చటం,లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటారు. డ్రైనేజీ నీరు నిలిచే చివరి ప్రాంతంలో సామాజిక ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం, వాటర్ ట్యాంకులు, బోరు బావులు, నల్లాల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటారు.

8వ తేదీ..

- వీధి కుక్కల సంచారంపై దృష్టి పెట్టడం, వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దాని గురించి నిర్ణయం తీసుకుంటారు. డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడటం తోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో ఫీవర్ సర్వేలు నిర్వహించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, యాంటీ లార్వా, ఆయిల్ బాల్స్ తయారీపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

9వ తేదీ..

- కార్యక్రమం చివరి రోజు శుక్రవారం అన్ని కుటుంబాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు సైతం డ్రై డేను పాటించాలి. నీటి నిల్వ కనిపించే ప్రతి ప్రదేశం, ప్రతి వస్తువును శుభ్రం చేయించాలి. వీటితో పాటు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి. ప్రభుత్వ, విద్యా సంస్థలను ఇందులో భాగస్వాములు చేయడం వంటివి నిర్వహిస్తారు.

విజయవంతం చేద్దాం: కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. గురువారం సీఎస్ శాంతి కుమారి.. జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం చేపట్టనున్నట్లుతెలిపారు. అన్ని శాఖల అధికారులు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఎంహెచ్‌ఓ పల్విన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, పశు సంవర్ధక శాఖ అధికారి పూర్ణచంద్ర రావు, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఈఈ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నిధుల మాటేంటి ?

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అందుకు తగ్గ నిధులు ఉండాలి. నిధులు లేకపోతే క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు పొందడం కష్టం. గత ప్రభుత్వం నిర్వహించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమం, ప్రస్తుత సర్కారు నిర్వహించిన ప్రజా పాలనను నిధులు విడుదల చేయకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బు, అప్పు చేసి కార్యక్రమాలు నిర్వహించినా ఆ తరువాత ఇందుకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. ప్రస్తుతం సర్పంచులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం బాధ్యత ప్రత్యేక అధికారులపై పడింది. కార్యక్రమం సక్సెస్ కావాలంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.


ప్రభుత్వ భూమిలో ఎర్రమట్టిని తవ్వి లారీలో నింపుతున్న దృశ్యం

ఎర్రమట్టి.. కొల్లగొట్టి!

- ప్రభుత్వ భూమిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- జేసీబీలతో తవ్వి లారీల్లో యథేచ్ఛగా తరలింపు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకునేవారే కరువు

మొయినాబాద్: ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. విలువైన ఎర్రమట్టిని తరలించుకుపోయి 'క్యాష్' చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూ సర్వేనంబర్ 218లో ప్రభుత్వ భూమి ఉంది. అందులో నుంచి అక్రమార్కులు రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీలతో లారీల్లో ఎర్రమట్టిని నింపి ఫాంహౌస్‌లకు తరలించుకుపోతున్నారు. మూడు రోజులుగా యథేచ్ఛగా వందల లారీల ఎర్రమట్టి తరలిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రస్తుతం గ్రామాల్లో క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థ లేదు. దీంతో ప్రభుత్వ భూముల్లో ఏం జరుగుతుందో రెవెన్యూ అధికారులకు సమాచారం ఉండడం లేదు. అధికారులు ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ భూములను పరిశీలించే పరిస్థితి లేదు. ఇదే అదునుగా అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను వివరణ కోరగా పెద్దమంగళారంలో ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వుతున్నట్లు సమాచారం వచ్చిందని..పరిశీలించి మట్టి తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లకు విశేష స్పందన



స్పాట్ అడ్మిషన్లకు హాజరైన విద్యార్థులు

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ 8 వార్డులో ఉన్న గిరిజన గురుకుల విద్యాలయంలో గురువారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు విశేష స్పందన లభించింది. ఆన్‌లైన్ అడ్మిషన్ల తర్వాత నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు భారీగా తరలివచ్చారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఐదు, ఆరు తరగతులకు ఒక్కొక్క సీటు, 8వ తరగతిలో పది, 9వ తరగతిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయని.. ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ)లో 19, బైపీసీ లో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

తాండూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ గేదె మృత్యువాతపడింది. ఈ ఘటన పట్టణంలోని హరహర టౌన్‌షిప్ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి కుర్వ బీరప్ప గేదెలను హరహర టౌన్ షిప్ సమీపంలో మేపుతున్నాడు. టౌన్ షిప్ సమీపంలో రోడ్డుకు అడ్డుగా విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. గేదెకు వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థులు ప్రమాదాన్ని గమనించి స్థానికులకు తెలిపారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

25 ఏళ్ల పోరాటం ఫలించింది

ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్



మోమిన్‌పేట: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ 25 సంవత్సరాలుగా పోరాటం చేయడంతో పదోన్నతులు పొందామని ఎస్ఎల్‌టీఏ(రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ) జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమా లు, అసెంబ్లీ ముట్టడి, ఎందరో ముఖ్యమంత్రులు ఎన్నో సార్లు హామీలు ఇచ్చిన అమలు చేయని హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించారన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్న కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు.

లాడ్జీల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

పట్టణ సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: లాడ్జీల్లో ప్రధాన ప్రదేశాల్లో తప్పక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ సూచించారు. గురవారం ఆయన పట్టణంలోని పలు లాడ్జీల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సీసీ కెమెరాల పని తీరును తెలుసుకున్నారు. లాడ్జీల్లో బస చేసేవారి వద్ద సరైన ధ్రువపత్రాలు తీసుకోవాలని సూచించారు. లాడ్జిలకు వచ్చే వారి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. చట్టవిరుద్ధంగా ఎవరికి గదులు ఇవ్వొద్దని అనుమానిత వివరాలు వెంటనే పోలీసులకు తెలిపాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు పోలీసులకు అప్పగించాలన్నారు.

బడులకు తాళం.. భవిష్యత్ అంధకారం

మీటింగ్‌లకు వెళ్లినా.. సెలవు పెట్టినా..

- ఏకోపాధ్యాయ పాఠశాలల మూసివేత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ఉపాధ్యాయుడు మీటింగ్‌కు వెళ్లడంతో పాఠశాలకు పడిన తాళం

నవాబుపేట: ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. మీటింగులున్నా.. ఉపాధ్యాయుడే సెలవు పెట్టినా.. బడి తాళం వేసి విద్యార్థులను ఇంటికే పరిమితం చేస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదంటూ ఆరోపణలు వస్తుంటే.. ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని చిట్టిగిద్దరైల్వే స్టేషన్, కుమ్మరిగూడ, కేషవపల్లి తదితర పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. గురువారం ఎక్‌మామిడి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ ఉండడంతో మధ్యాహ్నం 12గంటలకు పాఠశాలను బంద్ చేసి విద్యార్థులను ఇంటికి పంపించారు. సమావేశం ఉంటే మరో ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులకు లేదా అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సభలు సమావేశాల పేరిట బడులకు తాళాలు వేస్తే పిల్లల భవిష్యత్ ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై మండల విద్యాధికారి గోపాల్ వివరణ కోరగా ఈ రోజు ఎక్‌మామిడి స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు సమావేశం ఉండడంతో ఏకోపాధ్యాయులున్న పాఠశాలల ఉపాధ్యాయులను మధ్యాహ్నం వరకు పాఠశాలను నడిపి అనంతరం సమావేశానికి హాజరు కావాలని తెలిపామన్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల వేరే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయలేదన్నారు.

కందనెల్లి తండాలో భూ సర్వే

పరిశీలించిన ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

పెద్దేముల్: ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి మూడు రోజుల పర్యటనలో గురువారం ఆమె ధరణి రికార్డులు పరిశీలించారని తహసీల్దార్ కిషన్ తెలిపారు. అనంతరం మండల పరిధిలోని కందనెల్లి తండాలో రైతు రవి పొలంలో సర్వే మిషన్ ఆధారంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి పర్యటన సందర్భంగా రెవెన్యూ అధికారులు సమయపాలన పాటిస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రతీ నెల అధికారుల పర్యటన ఉంటే ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలకు వెంటనే పరిష్కారం లభిస్తుందన్నారు. ట్రెయినీ కలెక్టర్‌తో పాటు సర్వేయర్ శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్రైనీ కలెక్టర్ ఉమాహారతికి హద్దులు చూపుతున్న రెవెన్యూ అధికారులు

తాగుడుకు డబ్బులివ్వాలని తల్లిపై దాడి

తాండూరు రూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి కన్న తల్లిని చితకబాదాడు. ఈ ఘటన మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామంలోని లేబర్ కాలనీకి చెందిన బంగారుపల్లి వడ్డె లక్ష్మీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. కూలీ పనులు చేసే ఆమె కుమారుడు కృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు లేవని తల్లిని మధ్యాహ్నం రూ.500 ఇవ్వమని కోరాడు. ఆమె వద్దనున్న రూ.వంద ఇచ్చి పంపింది. మద్యం సేవించిన కృష్ణ మళ్లీ రూ.200 ఇవ్వాలని వేధించాడు. తనవద్ద లేవని చెప్పడంతో దాడి చేశాడు. తప్పించుకుని వెళ్తున్న ఆమెను అడ్డగించి ఓ కల్లు దుకాణం వద్ద తిడుతూ.. కింద పడేసి కొట్టాడు. గమనించిన స్థానిక మహిళలు అతన్ని అడ్డగించారు. వెంటనే ఆమె గౌతపూర్ సమీపంలోని ఠాణాకు వెళ్లి కుమారుడినపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సీఎం కృతజ్ఞతా సభకు తరలిరండి

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

తుర్కయంజాల్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల సమస్య ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలతో పరిష్కరించారని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరెడ్డి అన్నారు. ఇందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే సీఎం కృతజ్ఞతా సభకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులంతా హాజరవ్వాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 771 మంది ఉపాధ్యాయులు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారని గుర్తు చేశారు.

తల్లి పాలే శ్రేష్ఠం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

కేశంపేట: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టిన వెంటనే బిడ్డలకు ముర్రు పాలు తాగించాలని సూచించారు. దీంతో చిన్నారులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈఓ ఉపేందర్‌రెడ్డి, అంజిలమ్మ, హేమలత, చంద్రశేఖర్, రవికుమార్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కేసులు తప్పవు

సీఐ నర్సింహారావు



తనిఖీలు చేస్తున్న సీఐ, సిబ్బంది

కొత్తూరు: హోటళ్లు, కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో నిషేధిత గుట్కాలు, పాన్ మసాలాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తూరు సీఐ నర్సింహారావు హెచ్చరించారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి పట్టణంలోని హోటళ్లు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. లాడ్జిల్లోనూ తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, పాన్ మసాలాల వినియోగం ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వీటిని పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమమే యూనియన్ ధ్యేయం

- నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్



మృతుడి భార్య సురేఖకు చెక్కు అందజేస్తున్న యూనియన్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: డ్రైవర్లు ప్రమాదబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన టాక్సీ డ్రైవర్ సురేశ్ ఇటీవల మృతి చెందాడు. గురువారం స్థానిక టాక్సీ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో మృతుడి భార్య సురేఖకు రూ.5 లక్షల విలువైన చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్, టాక్సీ జేఏసీ చైర్మన్ నాగేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టాక్సీ డ్రైవర్ల సంక్షేమమే యూనియన్ ధ్యేయమన్నారు. ప్రతీ డ్రైవర్ తప్పక ప్రమాదబీమా చేయించుకోవాలన్నారు. ఈ బీమా పాలసీ ఆపదలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. యూని యన్‌లకు అతీతంగా ప్రతీ డ్రైవర్‌కు ఇన్సూరెన్స్ చేయించే బాధ్యత యూనియన్ నాయకులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ఖాజాపాషా, టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శివారెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, విశ్వనాథ్‌శెట్టి, షేక్ మొయినుద్దీన్, ఎండీ.వసీం, ప్రతాప్‌రెడ్డి, మహేశ్, ఈశ్వర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరంపై దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఒకరిపై కేసు

పెద్దేముల్: ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో బెల్లం, పానకం స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ తెలిపిన ప్రకారం.. నాటుసారా నిర్మూలనలో భాగంగా వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ భాస్కర్ గౌడ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని రచ్చకట్టతండా, పాషాపూర్, తట్టేపల్లి తదితర గ్రామాల్లో తాండూరు, మోమిన్‌పేట్ ఎక్సైజ్ అధికారులు ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు లీటర్ల నాటు సారా, 50 లీటర్ల బెల్లం పానకం, పది కిలోల నల్ల బెల్లంను స్వాధీనం చేసుకుని రాథోడ్ శాంతిపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం రచ్చకట్టతండాలో సారా నిషేధంపై తండా వాసులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ దాడుల్లో బాలగంగాధర్, నిజాముద్దీన్, శ్రీలేఖ, భీమయ్య సుల్తానా, మహేశ్, కిషోర్, ఎలిషారాణి, నర్సింలు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు

జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి వెంకటేశం



ఫెర్టిలైజర్ దుకాణంపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతగిరి: నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి వెంకటేశం హెచ్చరించారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆయన పురుగు మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. నిషేధిత మందులు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీ వేంకటేశ్వర ఫెర్టిలైజర్ దుకాణం పై దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో రూ.86వేల విలువైన 135 లీటర్ల నిషేధిత మందులు, గుల్షన్ బ్రదర్స్ షాప్‌లో రూ.25వేల విలువైన నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు.

తెగిపడిన విద్యుత్ లైన్

- తప్పిన ప్రమాదం
- గృహోపకరణాలు దగ్ధం



ఓ ఇంట్లో దగ్ధమైన విద్యుత్ బోర్డు

ఆమనగల్లు: 33 కేవీ విద్యుత్‌లైన్ వైర్ తెగిపడింది.. ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి స్థానిక సూర్యలక్ష్మి కాటన్‌మిల్‌లో విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా 33 కేవీ లైన్ ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి పక్కన భారత్ పెట్రోల్ సమీపంలో ఓ విద్యుత్ వైర్ అకస్మాత్తుగా తెగిపడింది. దీంతో ఓ ఇంట్లో విద్యుత్ వైరింగ్‌తో పాటుగా టీవీ, ఫ్రిడ్జి పాడయ్యాయి. పక్కనే భూషన్ హోటల్‌లో ఫ్రిడ్జిలు ఇతర సామగ్రి కాలిపోయాయి. తాము తీవ్రంగా నష్టపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక విద్యుత్ ఏఈ సీతారాములు ఘటనా స్థలానికి చేరుకుని వెంటనే విద్యుత్ లైన్ పునరుద్ధరించారు.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: మద్యం తాగించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు శివాజి రెడ్డిని గురువారం వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కాశిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, ఆరేగూడెం గ్రామానికి చెందిన మునుగాల శివాజీరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. గత నెల 29న తన స్నేహితుడు గౌతంరెడ్డి ఫోన్‌చేసి బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు రావాలని అక్కడికి వచ్చాడు. అనంతరం ఇద్దరూ కలిసి మద్యం మత్తులో ఉన్న యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మత్తు నుంచి తేరుకున్న తర్వాత బాధితురాలు గదిలో గౌతంరెడ్డి తో పాటు మరో వ్యక్తి ఉండడం, తనపై లైంగిక దాడి జరిగినట్లు గుర్తించి గట్టిగా కేకలు వేసింది. దీంతో రెస్టారెంట్ సిబ్బంది పోలీసులకు, యువతి స్నేహితులకు సమాచారం అందించగా, అక్కడికి వచ్చిన ఆమె స్నేహితులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని ఆరెంజ్ ఆసుపత్రికి తరలించారు. నిందితులు ఇద్దరు అక్కడి నుంచి అక్కడికి పరారైనట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు గౌతంరెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న శివాజీరెడ్డిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్

షాబాద్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవ లు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దా మోదర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించా రు. అనంతరం సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి చేశామన్నారు. ఇటీవ ల ఇద్దరు వైద్యులు నూతనంగా విధుల్లో చేరా రని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దాలన్నారు.విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీహెచ్‌ఓ సంతోష, డాక్టర్ తబుసమ్, సూపర్‌వైజర్ మేరినా, సిబ్బంది తదితరులున్నారు.



షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ దామోదర్

తండ్రి మందలించాడని..

యువకుడి అదృశ్యం

కేశంపేట: యువకుడు అదృశ్యమైన సంఘటన న మండలంలోని పో డగుట్ట తండాలోచోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ బబ్లూ అనే యువకుడు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు.బబ్లూ గత నెల 29న ఉద యం ఇంట్లో నుంచి తినకుండా బయటి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. అయితే తినకుండా ఎందుకు బయటికి వెళ్లావని తండ్రి ర వీందర్ కొడుకును మందలించాడు.అదేరోజు రాత్రి బయటికి వెళ్లిన బబ్లూ తిరిగి రాలేదు. కొడుకు ఆచూకీ కోసం ఎంత వెతికిని ఫలితం లేకపోవడంతో తండ్రి రవీందర్ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టార్గెట్ పూర్తిచేయాలి

- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, స్పెషల్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి
- 'వన మహోత్సవం'లో నాటిన మొక్కల పరిశీలన



దండుమైలారంలో మొక్కలను పరిశీలిస్తున్న నవీన్‌కుమార్ రెడ్డి

ఇబ్రహీంపట్నం: వన మహోత్సవంలో టార్గెట్ పూర్తి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురవారం ఆయన మండల పరిధిలోని రాయపోల్, దండుమైలారం, ముకునూర్ గ్రామాలను సందర్శించి కూలీలకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించి, ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. మండల పరిధిలోని 84 వేల మొక్కలను నాటాల్సి ఉండగా ఇప్పటి వరకు 35 వేల మొక్కలను నాటినట్లు చెప్పారు. 51 వేల మొక్కలు నాటేందుకు గుంతలను తీసి పెట్టినట్లు వివరించారు. రాయపోల్ గ్రామంలో నాటిన నాలుగు వేల మొక్కలను పరిశీలించి, మిగిలిన రెండు వేల మొక్కలను ఐదు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ముకునూర్ గ్రామంలోని శ్మశానవాటిక ప్రాంతంలో మొక్కలు నాటుతున్న కూలీలతో ముచ్చటించారు. మొక్కలు నాటే విధానంపై పలు సూచనలు చేసి మరో ఐదు రోజుల్లో 4వేల మొక్కలను నాటి టార్గెట్‌ను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి రాజ్‌కమార్‌ను, దండుమైలారం గ్రామంలో నాటిన మొక్కలను పరిశీలించి మిగిలిన 200 మొక్కలను నాటే పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ఆదేశించారు. గ్రామ నర్సరీని సందర్శించి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయాలన్నారు. రైతులు పొలం గట్లపై వారికి అవసరమైన మొక్కలు నాటుకుంటే అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్‌పతినాయక్, ఏపీఓ తిరుపతాచారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.